# అఖిల భారత దొంగల మహాసంఘం

భమిడిపాటి రాధాకృష్ణ



**దొంగలేమిటి, అఖిల భారత దొంగల సంఘం ఏమిటి ... అంటూ మీరు ముందుగానే బేజారెత్తిపోయి మీ జేబులూ అవీ గట్టిగా పట్టుకుని ఎటు పారిగెత్తాలా అని కంగారు పడిపోవద్దు. మేం 'మా అఫీసుపని' మీద మీ ముందుకు రావటంలేదు మా అఫీసు మీద ఒట్టు!**

**నేను** ఇంత గొప్పవాణ్ణి అని ఏ గొప్పవాడూ చెప్పుకోడు. చెప్పుకుంటే వాడు గొప్పవాడే కాదు. అలాగే ఉత్తముడైన ఏ దొంగ తను దొంగనని ఏనాటికీ చెప్పుకోడు. చెప్పుకుంటే వాడసలు దొంగే కాదు.

అయితే ఈ మధ్య దొంగలు అంతా ఒకచోట సమావేశం అయ్యాం. అఖిల భారత దొంగల ప్రథమ మహాసభ జరిపించాం. ఆ మహా సభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం ప్రకారం ఈ క్రింది విశేషాలన్నిటినీ సహృదయులైన మీ అందరి ముందూ సవినయంగా సమర్పించుకోవలసిన అవసరం మాకు పట్టింది.

ఒక్క మాటలో చెప్పాలంటే, మా కర్మ కాలింది!

అందుకే కలలో కూడా కలవని వాళ్ళం కలిశాం. జన్మలో వూహించని దారుణ పరిస్థితులు కళ్ళారా గమనించాం. జన్మజన్మలకీ పైవాళ్ళకి—అంటే మీబోటి 'నాన్—దొంగ'లకి చెప్పకూడని సంగతులన్నీ తప్పనిసరిగా చెప్పెయ్యదలుచుకున్నాం.

అంచేత, మీ ఇష్టం వచ్చినంత దూరంగానైనా సరే కూచుని, దయచేసి సావధానంగా మా మొర ఆలకించండి.

ఈ నాటి దొంగల్ని చూసి మమ్మల్ని కూడా ఆ కల్తీ దొంగల క్రిందే జమ కట్టెయ్యకండి. అర లీటరు ఆవు పాలలో ఆరు లీటర్ల గాడిద పాలు కలిసిపోయాయి. మాతో చెప్పకుండా, మా పర్మిషన్ లేకుండా ఈ మధ్య చాలా మంది నెల తక్కువ దొంగలు మా మధ్య జొరబడిపోయారు. మూడు పండులూ, ఆరు కన్నాలూగా నీటుగా స్వీటుగా బతుకుతున్న మమ్మల్ని, మా పేరుని దుమ్ములో కలిపేశారు.

అసలు మా పేరు ఎలాంటిది? మా పరువు, ప్రతిష్ఠ ఎంత శోభాయమానంగా ఉండేవి! ఈ మా అఖిల భారత దొంగల మహా సంస్థకి పూజ్యులైన వ్యవస్థాపకులు, అమరులైన అధ్యక్షులు ఎవరో మీకు గుర్తు లేదా? — సాక్షాత్తూ శ్రీకృష్ణ పరమాత్ముడు!

ఆయన 'వెన్న దొంగతనాలు' ఎంత రమ్యంగా, ఎంత కళాత్మకంగా చేశారు? మనుషుల్ని ఎంత రసాత్మకంగా కదిలించారు!— శ్రీవారి పేరు ఇన్ని యుగాలయినా ఎంత ఆనందంగా చెప్పుకుంటున్నాం?

ఇంట్లోవాళ్ళు ఇంట్లోనే ఉంటారు. శ్రీకృష్ణుడు తన శిష్యులతో సహా లోపలికి వెడతాడు. చీమ చిటుకుమనదు. తడకలు, తలుపులు సినిమా సంగీ

తాలు పాడవు. పది అడుగుల ఎత్తు మీదున్న కుండల్లో వెన్న పది నిమిషాల్లో మాయం అయిపోతుంది. అదీ గురువుగారి చాకచక్యం! అయితే, ఆయన ప్రియ శిష్యులైన ఆ గోప బాలురకందరికీ ఆ విద్య వచ్చిందా? ఆ స్వారస్యం అబ్బిందా? వేల మందికి ఒక్కడే పుడతాడు, అటువంటి సర్వవిద్యా పారంగతుడైన దొంగబిడ్డ!

అరవై నాలుగు కళల్లో ఒక కళగా ఈ చోర కళని గుర్తించి, గౌరవించారు మన మహా ఋషులు. నవ్వించడం, నవ్వడం అంత తేలిక కాదు. అలాగే దొంగతనం చేయడం, దొంగ కబుర్లు చెప్పడం అంత సులభం కాదు. విచిత్రం ఏమిటంటే, మిగతా అరవై మూడు కళలూ దేని కదే ఒక కళ. కాని ఆ అరవై మూడు కలిస్తేనే నిలుస్తుంది విండైన చోరకళ. అందుకనే ఇది విశిష్టమైన కళ. అందరికీ సాధ్యం కాని అపూర్వమైనకళ. సరదాగా ప్రయత్నం చేస్తే తక్కువ వచ్చేది కాదు. హిమాలయాలంత కృషి ఉండాలి. భూమికున్నంత ఓర్పు కావాలి. సముద్ర మంత లోతైన గుండె తోడవాలి. మెరుపులాంటి స్ఫూర్తి రావాలి. అవసరం అయితే విమానం లాంటి కాళ్ళు కూడా కావాలి. అన్నిటికీ మించి పూర్వజన్మ సుకృతం ఉండాలి. అప్పుడే అసలైన, సిసలైన చోర కళ పట్టుపడుతుంది.

తమరు మరోలా అనుకోమంటే ఒక చిన్న మనవి. ప్రస్తుతం మీరు పెడుతున్న మహా మహా ఆలిండియా పరీక్షల్లో నెగ్గినవాళ్ళు కూడా మా సిలబస్సులో నిలబడలేరు.

మారూల్సు ఇనప రూల్సు. కొడుకు, బావమరిది మేనల్లుడు, పాత ఫ్రెండు సింగిల్ కొడుకు—ఇలాంటి చవట బంధాలు మాకు లేవు. డబ్బున్న వాడి కొడుకు గదా—డొనేషన్ ఇస్తాడని మేం చచ్చినా చేర్చుకోం. వెనకబడ్డ జాతి, ముందుపడ్డ జాతి ఇలాంటి పాడుబడ్డ పేర్లు మేం పెట్టం. ఎమ్. ఎల్. ఎలు, మంత్రులు మొదలైన గౌరవనీయులైన పెద్దవాళ్ళు అలవాటు కొద్దీ పంపించిన రికమండేషన్లు కూడా మేం కన్నెత్తి చూడం. సత్తా ఉన్నవాడే మా వాడు. మేం పెట్టిన పరీక్షలో నెగ్గినవాడే మా మెంబరు. మా పరీక్షల్లో — 'ఇంగ్లీషులో జపాన్ గురించి రెండు పేజీలు రాయి, ఆరువేలకి అరవై పెర్సెంటు చొప్పున ఆరు రోజులకి వడ్డీకట్టు, కిసికిస్తాన్ ప్రెసిడెంట్ ఎవడు?'—ఇలాంటి తోటకూర ప్రశ్న లడగం. మావి ప్రాక్టికల్ పరీక్షలు. పూరవతల ఇల్లు చూపిస్తాం. ఇంటి ముందు గోడ చూపిస్తాం. అంతే గాని, ఈ రోజుల్లో కుర్రాళ్ళు కాపీ కొడుతూంటే వాచర్లు భయంతో కళ్ళుమూసుకున్నట్టు, ఆఇంట్లో వాళ్ళని కళ్ళుమూసుకుని పడుకోమని మేం బెదరించం. లంచాలు ఇవ్వం. నెగ్గి వచ్చిన వాడే మావాడు. ఇంత పకడ్‌బందీ వ్యవహారం మాది.

ఇంత మావ్యాపారం అంటారా? హస్తలాఘవమే దానికి పెట్టుబడి. కనికట్టు మా ఆయువుపట్టు. జేబున్న వాడికి తెలియకుండా జేబులో డబ్బు కాజేస్తాం. ఇంట్లోవాళ్ళకితెలియకుండా ఇంట్లోసొత్తులాగేస్తాం. మనలో మన మాట. మేం చపాయించెయ్యాలంటే అవతలవాడి దగ్గర ఏదో రకం డబ్బో దస్కమో, నగో నట్రో ఉండాలి గదా? అందుకే ఉన్నవాళ్ళ దగ్గరే అంతో ఇంతో నొక్కుతాం. లేనివాళ్ళు మావాళ్ళే!

ఈ మధ్య ఓ పెద్ద దేశం ప్రెసిడెంటు తన ప్రెసిడెంటు హోదాలో సెంట్రల్ జైలు విజిట్‌కి వెళ్ళాడు. ఆ జైల్లో మా సోదరుడైన ఓ పేరు మోసిన గజదొంగ ఉన్నాడు. ఆ దొంగని చూడాలని ఆయనకి కుతూహలం కలిగింది. జైలు సూపరింటెండెంటు దొంగని తీసుకువచ్చాడు. ఆ దొంగ సన్నగా, పొట్టిగా నూనూగు కుర్రాడిలా ఉన్నాడు. ప్రెసిడెంటుకి నవ్వాగలేదు.

"ఏమిటీ? — ఇన్ని రాష్ట్రాల్లో అంత పేరు పొందిన గజదొంగ నువ్వేనా?— పేరుకి తగ్గట్టేనా లేవే!'' అని నవ్వుతూ షేక్‌హాండ్ ఇచ్చాడు.

దొంగ షేక్‌హాండు అందుకుంటూ, సిగ్గు పడుతూ నవ్వి, "నన్నేం చెయ్యమంటారు? నా పేరుకి నా కన్నా ఆకతెక్కువ!'' అన్నాడు.

ప్రెసిడెంటు విరగబడి నవ్వాడు. "అయితే పోనీ, ఆ పేరేనా నిలబెట్టుకో. నీ విద్య ఏమిటో చూపెట్టు!'' అని సవాల్ చేశాడు.

దొంగ మళ్ళీ సిగ్గుపడుతూ నవ్వి, "టైమెంతయిందండీ?'' అని అడిగాడు.

ప్రెసిడెంటు నవ్వుతూ, "ఏం? దొంగతనానికి కూడా ముహూర్తాలున్నాయా?'' అంటూ తన కుడి ముంజేతి కేసి చూసుకున్నాడు. వాచీ లేదు. కళ్ళు నులకరించి, కంగారుగా మళ్ళీ చూసుకున్నాడు. వాచీ గ్యారంటీగా లేదు.

"నా ... నా వాచీ ఏదీ?''

"ఇదుగో'నండీ మీ వాచీ!' అని ఇంకా సిగ్గు పడుతూనే నవ్వి మా సోదరుడు ప్రెసిడెంటు వాచీ వెనక్కి ఇచ్చేశాడు! అదీ మా విద్యలో ఉండే విలువిద్య. శక్తి ఉంటే మా విద్యలో నైపుణ్యం చూపెట్టి బ్రతుకుతాం. లేకపోతే అజ్ఞాతవాసానికి వెళ్ళిపోతాం. అంతేగాని, శ్రీకృష్ణ పరమాత్ము డిచ్చిన కళకి ద్రోహం చెయ్యం. కళలేని కళాయి దొంగతనాలు మేం చెయ్యం. దారి దోపిడీలు మేం తలపెట్టం. తలుపులు, తలలు బద్దలు కొట్టం. బ్లాక్‌మెయిల్ చెయ్యడం మా కళ కాదు. హత్యలు చెయ్యడంకన్నా, ఆత్మహత్య చేసుకోడం మిన్న అని నమ్మేవాళ్ళం.

అయితే ఏం లాభం? మమ్మల్ని, మా కట్టుబాట్లని, మా కళని కూడా మింగేసే అజీర్ణపు దొంగలు ఈ మధ్య చాలా మంది వచ్చిపడ్డారు. దొంగలమే సిగ్గుపడే దొంగలు లేచారు. మేం పెట్టిన నిర్దాక్షిణ్యమైన రూల్సుకి తట్టుకోలేక, మా ట్రెయినింగుకి నిలబడలేక, మా నీతీ నిజాయితీలకి సరితూగ లేక అన్‌క్వాలిఫైడ్ దొంగలు, మా దొంగల జాతి ఇంటి ముందు బ్రతికే కుక్కలకన్నా నీచులు నేటి మన ప్రజా జీవితంలోకి బాహాటంగా వచ్చేశారు.

అందులో ఒక బ్రాంచి ప్రజాసేవకులమని టోకు పేరు పెట్టుకున్నారు. వీళయినన్ని గౌరవ సంఘాల్లో చిల్లరగా చేరిపోయారు. మళ్ళీ ఇందులో చిన్న చేపలు మునిసిపల్ కౌన్సిలర్లుగానూ, కార్పొరేషన్ మెంబర్లుగానూ, జిల్లాపరిషత్ సభ్యులుగానూ దొడ్డిదారమ్మట దూరిపోయారు. మరి, పెద్ద చేపలు— అంటే నోరు మరీపెద్దదైన తిమింగలాలకిచుట్టాలు శాసన సభల్లోనూ, పార్లమెంటులోనూ అందరి కళ్ళూ మూసి కలిసిపోయారు. ఆ మెట్లు ఎక్కడానికి ఎన్నో నోట్ల కట్టలు విరజిమ్మేశారు. మైకులు మింగేసి మాయ మాటలు చెప్పారు. మందు పోశారు. మొత్తానికి పోస్టు సాధించారు. మరి దాన్ని రోస్టు చేసి,

## ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టం

'సాక్షి' సంఘ సభ్యులకు జంఘాలశాస్త్రి ఒకసారి ఒక విచిత్రోదంతం వినిపించాడు. ఆయన ఒకసారి మతి లేని మనిషిని చూడటానికి పోతే ఆయన ఈయనకు వినిపించిన వృత్తాంతమట ఇది:

"పిచ్చివాడు నన్ను జూచుట తోడనే 'నమస్తే' యని కేకవైచెను. నీవు వచ్చెదవని యనుకొనుచునే యున్నాను. ద్రౌపదీ వస్త్రాపహరణము ప్రక్క పందులో రాత్రి యాడినారు. డాక్టరు గారు నన్ను గూడ నాటకములోనికి దీసికొని వెళ్ళినారు. ధృతరాష్ట్ర సభ జరుగుచున్నది. పాండవు లోడిపోయి ఖిన్నులై కూరుచుండినారు. దుర్యోధనుడు మీసాలు వడివేసి పకిలించుచున్నాడు. దుశ్శాసనుడు ద్రౌపది చీర లాగుచున్నాడు. ఎంతవఱకు లాగవలయునో దుశ్శాసనునికి తెలియదు. ఎంతవఱకు లాగించుకొనవలయునో ద్రౌపదికి తెలియదు. ఇద్దరు కూడ చెడత్రాగియున్నార.. వద్దు వద్దని తెరచాటు నుండి కేకలు వినబడుచునే యున్నవి. తుట్టతుదకు రైకతో. నెత్తిపై నవరపు బుట్టతో, నడుమునకు గావంచతో, సృష్టికంతకు నొక్క ఓదిష్టి పిడతగ ద్రౌపది మిగిలినది. దుర్యోధనాదుల తోడు లేకుండనే జాత్యంధుడైన ధృతరాష్ట్రుడు గూడ రెప్పపాటులో తెరచాటునకు పరుగెత్తినాడు. తెర వేయబోవగబడలేదు. అప్పుడు ద్రౌపది లోనికి బోయిన యెడల సధికారి కొట్టునని భయముచేత గాబోలు పెద్ద మనుష్యులు కూరుచుండిన గోతిలో నురికి ప్రచ్ఛన్నతకొరకో, పురుషులు కొట్టుదురను భయముచేతనో స్త్రీలకు ప్రత్యేకించిన స్థలములో దాగినాడు. స్త్రీలు సాక కాలిపోవునంత కేకలు వేసి యిటు నిటు పాఱిపోవ యత్నించిరి. కొందరు పురుషులు స్త్రీల స్థలములోనికి వచ్చి ద్రౌపదిని జావగొట్టి గెంటివైచిరి" అని పిచ్చివాడు ముగించాడు.

– పానుగంటి లక్ష్మీ నరసింహారావు

('సాక్షి' ఆరవ భాగం)

వేళ్ళతో సహా జాడించేసి, లక్షకి కోటి చొప్పున దులుపుకోవాలి గదా? అందుకని రాత్రీ పగలూ వాళ్ళకి ఒకటే దృష్టి! అయిదేళ్ళ టైము. అయిదుకోట్లు మినిమం! ఎలా? దెయ్యం పట్టినట్టు ప్రజాసేవ మొదలెట్టేస్తారు. అడ్డమైన గడ్డీ అరక్కపోయినా తినేస్తారు. దణ్ణం పెట్టిన ప్రతివాడి చేతులూ కొరికేస్తారు. ఈ ప్రజాసేవ భరించలేం బాబోయ్ అని ప్రజానీకం గోల. ప్రజలు సర్వనాశనం అయిపోయినా సరే, ప్రజాసేవమాత్రం మానం అని వీళ్ళు ఆ ప్రజల మీదే ప్రమాణాలు చేస్తారు. ఇలాంటి ప్రజాసేవకుల చేతుల్లో పడ్డ మనం ఎన్ని జన్మల పుణ్యం చేసుకున్నామో! అందుకే నెహ్రూ, పటేల్, రాజాజీ, లాల్‌బహదూర్ శాస్త్రి, ప్రకాశం, కామరాజనాడార్ మొదలైన దిగ్గజాలు అడుగుపెట్టిన పవిత్రమైన మన దేశం రాష్ట్ర, ప్రజాలయాల్లో ఇలాంటి వాళ్ళని కూడా చూస్తున్నాం. నువ్వు దొంగ అంటే నువ్వు దొంగ అని తిట్టుకుంటున్నారని, ఒకళ్ళ చొక్కాలు ఒకళ్ళు చింపుకుంటున్నారనీ, యథాశక్తి చెప్పులు చేతబట్టి కొట్టుకుంటున్నారనీ చెవులారా వింటున్నాం. అదృష్టమంటే మనదే అదృష్టం!

మరి, రెండో బ్రాంచి— వీళ్ళు పై బ్రాంచి వాళ్ళ ఆశీర్వాదాలతో పుట్టిన రావణాసురుడి వారసులు. వీళ్ళు వీలయినన్ని వ్యాపార సంస్థల్లో చేరిపోయారు. నిజాయితీ వ్యాపారస్థుల నీడలయిపోయారు. బియ్యం కల్తీ, గోధుమలు కల్తీ, పప్పులు కల్తీ, నూనె కల్తీ, నెయ్యి కల్తీ, పాలు కల్తీ, పాల డబ్బా కల్తీ. పిడుగులాంటి మనిషి—పదేళ్ళలో మంచం ఎక్కిపోతే మేం వ్యాపారస్థులమే కాదని మనఃస్ఫూర్తిగా ప్రమాణం చేస్తున్నారు. మరి ఈ కల్తీలే తినగా తినగా టానిక్కులుగా మారిపోయి కొంతమంది జనం చావడం మరిచిపోయి, మిగిలిపోయా రనుకోండి. వాళ్ళకోసం ఈ బ్రాంచిలో 'దుర్—బ్రాంచి' (నోపికుంటే 'దుర్బ్రాంచి' అని కూడా అనచ్చు) మరోటి పెట్టారు. ఇటుకలు కల్తీ, సిమెంటుకల్తీ, సున్నం కల్తీ, కొంపే కల్తీ. రెండేళ్ళలో శాల్తీ కనిపిస్తే మాదీ పూచీ అని వీళ్ళు గుండెలు బాదేసుకుంటున్నారు. మరీ దారుణమైన మనుషులు ఈ రెండు కల్తీ గేట్లు దాటుకు వచ్చేశారనుకోండి. టాబ్లెట్లు కల్తీ, మందులు కల్తీ. ఇంక మనిషి మందులోకి కూడా దొరకడు!

ఇంక మూడో బ్రాంచి — బతికి ఉన్నవాళ్ళు బతుకు కన్నా చావే నయం అన్న వేదాంతాన్ని అరటిపండు ఒలిచినట్టు చెప్పి, పండు వాళ్ళు మింగి, తొక్క మన చేతుల్లో పెట్టడానికి ఈ మూడో బ్రాంచి వాళ్ళు లేచారు. లేచి గవర్నమెంటు ఉద్యోగాల్లోకి దూరిపోయారు. చాలామంది గవర్నమెంటు ఉద్యోగస్థులు తెచ్చుకుందాం అనుకుంటున్న మంచిపేరును, నీతిగా, నిజాయితీగా నిలబడదాం అని పనిచేస్తున్న ఉద్యోగస్థుల ఆశల్ని చెడగొడుతున్నది ఈ మూడో బ్రాంచి వాళ్ళే. ఈ బ్రాంచి వాళ్ళు రూల్సు ప్రకారం ప్రజలకి న్యాయంగా ఎలా సేవ చేద్దామా అని కాదు. వీలయినన్ని రూల్సు పట్టుకుని, గిరగిరా మెలికలు తిప్పి వాటితో జనాన్ని బిగించేసి, లంచాలు ఎన్నెన్ని రకాలుగా లాగెయ్యాలా అనేదే వాళ్ళ ఏకైక దృష్టి. వీళ్ళు ఎలా ఎలా ఈ లంచాలు సాగు చేస్తున్నారు అన్నది మేం మళ్ళీ మీకు వివరంగా చెప్పక్కర్లేదు. ఇచ్చుకుంటున్నది సాక్షాత్తూ తమరేకదా?

ఇంక నాలుగో బ్రాంచి — ఇదో రకం జనరల్ బ్రాంచి. పై మూడు బ్రాంచిల్లో ఏ ఒక్కదాంట్లోనూ సర్దుకునే పాటి తలకాయ కూడా లేని వాళ్ళు ఇందులో చేరతారు. భగవంతుడు తలకాయ ఎందుకు పెట్టాడు అంటే, క్రాపింగ్ దువ్వుకోడానికి అనే రకం. వీళ్ళు శరీరంతోనే ఆలోచిస్తారు. శరీరంతోనే పని చేస్తారు. అందుకే ఈ బ్రాంచిలో రౌడీలు, దోపిడీ దొంగలు, గూండాలు, హంతకులు, రేప్‌రాయుళ్ళు పుష్కలంగా కనిపిస్తారు. ఒక వేళ పాపం, ఎప్పుడైనా కొంతమంది సెన్సారుబోర్డు మెంబర్లు కనిపించినా మీరు ఆశ్చర్యపడక్కర్లేదు. సినిమాల్లో 'పాడు, అతిపాడు' సీన్లు, 'జుగుప్సాకరమైన ఘాతుకాలు', రకరకాల 'రేప్' లు అయిదేళ్ళపాటు వరసాగ్గా, తీవ్రంగా అదేపనిగా చూశారనుకోండి. అది వాళ్ళ నరనరాల్లోకి ఎక్కిపోతుంది. ఏమాత్రం మామూలు మనిషైనా ఏదో టైములో ఈ బ్రాంచి కేసి దృష్టి పారెయ్యవచ్చు.

## ఒకే పోలిక

**రోమన్** చక్రవర్తి అయిన అగస్టస్ కాలంలో ఇద్దరు యువకులు ఒకే పోలికలో ఉండేవారు. అయితే వారు వేరు వేరు కుటుంబాలకు చెందిన వారు. వేరు వేరు గ్రామాలకు చెందిన వారు. తల్లిదండ్రులూ వేరు వేరు. అయితే వారు ఒకే పోలిక గల వారు ఎట్లా అయినారు? పలువురు పలు విధముల ఒడిపోసుకున్నారు. ఆ మాటలు ఆ పిల్లల చెవుల పడినవి. వారికి మనః క్లేశము కలిగినది. ఒక రోజున వారిద్దరూ రోములో ఒక శృంగాటకములో తారసిల్లినారు. అందులో ఒకడు రోము పట్టణనివాసి రెండోవానిని అడిగాడు—"అన్నా! మీ తల్లి కొంత కాలం ఈ పట్టణమున నివసించినదా?" అని.

అయ్యా, అదీ సంగతి. ఇందులో మొదటి మూడు బ్రాంచీల మనుషులు మా సంఘంలో జబర్దస్తీగా దూరేశారు. మమ్మల్ని సందుల్లో తొక్కేసి గోడ దూకేశారు. లక్షలకి లక్షలు కూల్‌డ్రింక్సులా తాగుతున్నారు. వాళ్ళని పట్టుకోడానికి రూల్సు చాలడం లేదు. ప్రజాసేవ అని చెప్పి పదికోట్లు సంపాదించిన రాజకీయవేత్త బాగున్నాడు. వ్యాపారసేవ అని ఇరవైకోట్లు నంజుకుంటున్న వ్యాపారవేత్త బాగున్నాడు. రూల్సు చూపెట్టి, లంచాలు గుంజుకుంటున్న రూళ్ళ కర్రలూ బాగున్నాయి. దోపిడీ దొంగలు ధర్మదర్శనం ఇస్తే సంబరాలు చేస్తున్నారు. పచ్చి హంతకులు సత్యన్నారాయణ వ్రతం చేస్తే ప్రసాదం కోసం క్యూలో నుంచుంటున్నారు. కాని చిన్న జేబులో చెయ్యెడితే మమ్మల్ని మూడేళ్ళు జైల్లో పారేస్తున్నారు.

ఇదేమన్నా న్యాయంగా ఉందా, చెప్పండి? వీళ్ళు మా ఇంట్లో దూరి మమ్మల్ని బయటికి గెంటేశారు. వాళ్ళు మెజారిటీగా మీసాలు దువ్వుతున్నారు. మేం మైనారిటీ అయిపోయాం. శ్రీకృష్ణపరమాత్ముడు 'వెన్నస్థాపన' చేసిన మా వృత్తికి ఇప్పుడు రక్షణ లేదు. తరతరాల మా కళకి, ఆ కళకే అంకితమైపోయిన మా కళాకారులకి దిక్కే లేదు. మా సంసారాలు దీపాల్లేని వీథుల్లో పడ్డాయి.

ఈ విషమ పరీక్షలో మేం బతికి మళ్ళీ బట్టకట్టాలంటే కళా హృదయులైన మీరే మమ్మల్ని నిలబెట్టాలి. కళామతల్లి కలకలలాడాలంటే, మీరు మాకూ మైనారిటీ హక్కులు ఇచ్చి తీరాలి. మీలో మా గురువుగారిని చూసుకుంటూ, మీకు నమస్కారం చేసి, నాలుగు కోర్కెలు మాత్రమే కోరుతున్నాం.

1. ఆ కల్తీ దొంగల్తో మమ్మల్ని కలిపి మంచెయ్యకుండా, మూలవిరాట్టులమైన మమ్మల్ని వేరే ప్రత్యేకమైన మైనారిటీగా గుర్తించండి.

2. విధి వంచితులైన మా పిల్లల్ని ఈనాటి వీధి చదువుల్లోనే పెట్టెయ్యదలుచుకున్నాం. అయితే మేం మైనారిటీలం—మా పిల్లలకి బుర్ర తక్కువ. అందుకని మా వాళ్ళకి ఇన్ని సీట్లు కేటాయించండి అని అడిగేటంత నిరభిమానులం కాదు. మా పిల్లలు చాకుల్లాంటి వాళ్ళు. అది వాళ్ళ వంశ కళా భిక్ష. కాని ప్రస్తుతం మేం దిక్కులేనివాళ్ళంగా చేయబడ్డాం గనుక, మా పిల్లలకి ఎమ్. ఎ., ఎమ్. ఎస్‌సి., ల వరకూ ఫ్రీగా చదువుకునే స్కాలర్ షిప్పులు ఇప్పించండి.

3. ఇంక ఉద్యోగాలంటారా? అర్హత ఉంటేనే మా వాళ్ళకి ఇవ్వండి. అడ్డదార్లు తొక్కడం మా రక్తంలో లేదు. కాని, దొంగజాతి పిల్లలనే పేరు పెట్టి, రకరకాల రిజర్వేషన్లనే అడ్డం పెట్టి మా వాళ్ళకి అన్యాయం జరగకూడదనే మా బాధ. కాని ప్రస్తుతం అన్యాయం ఒక్కటే తు.చ. తప్పకుండా జరుగుతూంది. అందుకని మా పిల్లలకి పది శాతం రిజర్వేషన్ ఇప్పించండి.

4. కాలం చక్రం లాంటిది. అందుకనే కాలచక్రం అన్నారు. మరో పదిహేనేళ్ళలో ఈ కల్తీ దొంగలంతా కొట్టుకుపోవచ్చు. ప్రజలు నిజాన్ని గుర్తించి, మళ్ళీ మమ్మల్ని, మా కళని గౌరవించవచ్చు. అందుకని మేం నిస్వార్థంగా కళామతల్లి సేవ కోసం ప్రత్యేకంగా స్థాపించబోతున్న 'చోర కళా విశ్వవిద్యాలయా'నికి అధికార పూర్వకంగా గుర్తింపు, ఆర్థిక సహాయం వచ్చేలా చేయండి.

ఈ కోర్కెలు మాత్రం తీర్చండి. మీ రిచ్చిన బలంతో నిలబడి, విశ్వాసంగా మీకు అండగా ఉంటాం. మీరు గురవుతున్న కల్తీ దొంగల బాధ మేం తీరుస్తాం. దేవుడు చల్లగా చూస్తే, మా 'చోరకళా విశ్వవిద్యాలయ' విద్యార్థే మరో పదిహేను ఏళ్ళలో భారతదేశ అధిపతిగా మిమ్మల్ని సర్వవిధాలా సేవించుకుంటాడు. దయచేసి మనఃస్ఫూర్తిగా ఆశీర్వదించండి. *